




# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :179 | బుధవారం 02 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## మ్యాట్రిమోని గ్రూప్‌లో పాకిస్థాన్ హీరోయిన్ ఫొటో.. యువకుడిని మోసం చేసిన నేరగాళ్లు



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** పెళ్లి పేరుతో పాకిస్థాన్ హీరోయిన్ ఫొటోలు పెట్టి నగరంలోని బహదూర్‌పురాకి చెందిన ఓ యువకుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. బాధితుడి నుంచి రూ. 21.73లక్షలు కాజేశారు.

## ప్రభుత్వ అలసత్వంతోనే పాశమైలారం ఘటన : ఎమ్మెల్సీ కవిత

**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు.



## మాటలు కోటలు దాటితే సరిపోదు.. చేతలు కూడా ఉండాలి

### :సీఎం రేవంత్‌పై హరీష్ రావు సెటైర్

●పంట బీమా మాటలకే పరిమితం ..అమల్లో శూన్యం ● రైతులకు హామీలు ఇచ్చి చేతుల్లో శూన్యం ● 1300 కోట్ల బడ్జెట్ కేటాయింపు కూడా కాగితాలకే పరిమితం ● పంట బీమా విషయంలో కాంగ్రెస్ మొద్దు నిద్ర వీడాలి

: హరీష్ రావు



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ నేత హరీష్ రావు మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 'పంట బీమా అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టిన రేవంత్ రెడ్డి నాలుగు సీజన్లుగా పంట బీమా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. మాటలు కోటలు దాటితే సరిపోదు.. ఆచరణ కూడా గడప దాటాలి. ఎన్నికలు వస్తే హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక 'మొండిచేయి' చూపడం హస్తం పార్టీకి అలవాటుగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, రోట్లో తలపెట్టిన చందంగా రైతుల పరిస్థితి మారింది. అభయ హస్తం మేనిఫెస్టో, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అనేక హామీలు గుప్పించారు. అమలు చేయాలని డిమాండ్ చేస్తే మాత్రం' వ్యక్తిగత దూషణలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

● బీజేపీపై పోరాటం ఉధృతం చేయాలి: సీఎం రేవంత్ ●రొయ్యల పులుసు, రాగి సంకటితో మాకు పని లేదని.. నీళ్ల ప్రయోజనాలే మాకు ముఖ్యం ● బీజేపీపై పోరాటం ఉధృతం చేయాలి: కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేస్తోంది ● చంద్రబాబు మనుగడ గోదావరి జలాల మీదే ఆధారితం ● కిషన్ రెడ్డి కేసీఆర్ మాటలనే మాట్లాడుతున్నారు ●నీటి హక్కుల కోసం మేము పోరాడతాం - తాత్కాలికంగా అడ్డుకున్న బనకచర్ల మళ్లీ వస్తుంది ● తెలంగాణ హక్కులను కేంద్రం కాలరాస్తోంది

– సీఎం రేవంత్ రెడ్డి



# బనకచర్లకు బ్రేక్ పడలే.. జస్ట్ కామా మాత్రమే..

**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతుల తిరస్కరణ తాత్కాలికమేనని.. పునఃపరిశీలన తర్వాతైనా బనకచర్ల ప్రాజెక్ట్ మళ్లీ తెరమీదకు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత అధికారులు ఈ పీపీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని మోడీ సర్కార్ మనుగడ చంద్రబాబు మీద ఆధారపడి ఉందని.. చంద్రబాబు మనుగడ గోదావరి జలాల మీద ఆధారపడి ఉందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

11 ఏళ్లుగా తెలంగాణను కేంద్రంలోని బీజేపీ నిర్లక్ష్యంగా చేస్తోందని.. రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బీజేపీపై పోరాటం ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చచ్చిన బీఆర్ఎస్‌ను బతికించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర హక్కులను కాలరాసేందుకే బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చామా అని ప్రశ్నించారు. ఏపీ నుంచి కేంద్రంలో ఉన్న మంత్రులు వాళ్ల రాష్ట్ర కోసం ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు మాత్రం రాష్ట్రం కోసం ఎలాంటి ప్రయత్నం చేయట్లేదని విమర్శించారు.

## మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇప్పిస్తాం



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు పాశమైలారం ఘటన మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇప్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అదే విధంగా తీవ్రంగా గాయపడి ఎలాంటి పని చేసుకోలేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షలు, స్వల్పంగా గాయపడి, తిరిగి పనిచేసుకోగలిగే వారికి రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, గురుకులాలో సీట్ల గురించి మాట్లాడాలని అధికారులకు సూచించామని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం తరపున వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు.

## బనకచర్లకు అనుమతుల తిరస్కరణ తెలంగాణ సర్కార్ విజయం: మంత్రి ఉత్తమ్

●తెలంగాణ వాదనతో కేంద్రం అంగీకారం ● బనకచర్ల పర్యావరణ అనుమతులకు తిరస్కారం● బనకచర్లపై చంద్రబాబు వాదనలు అవాస్తవం ●బనకచర్ల ప్రాజెక్ట్ ఆపడమే తెలంగాణ ప్రజల విజయం: ●సీఎం, డిప్యూటీలతో ఉత్తమ్ ప్రజెంటేషన్ సీడబ్ల్యూసీ క్లియరెన్స్ లేకుండా అనుమతులే లేవు తేల్చి చెప్పిన కేంద్రం



## కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తాం..



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రిగా ఉన్న ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తిరిగి వస్తే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ను నిషేధిస్తామని అన్నారు. ఆర్ఎస్ఎస్ సమాజంలో ద్వేషాన్ని వ్యాప్తింపచేస్తోందని ఆరోపించారు. చట్టపరిధిలో ఆ సంస్థ పనిచేయడం లేదని అన్నారు. ప్రియాంక్ ఖర్గే తన వాదనల్ని సమర్థించుకోవడానికి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. గతంలో సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్ ని నిషేధించారని, ఆయన పాదాలపై పడి దేశ చట్టాలను పాటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

## కొత్త రేషన్ కార్డుల ముహూర్తం ఫిక్స్



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రేషన్ కార్డు దరఖాస్తు దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ నెల 14న సీఎం రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మొత్తం 2 లక్షలకు పైగా లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## బడాబాబుల ఇళ్లు కనబడవా?

### హైడ్రా చర్యలపై కేటీఆర్ ఘాటు విమర్శలు



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవస్థను ఒక్కటిగా కాకుండా, విభజన ధోరణితో నడుపుతోందని ఆరోపించారు. ముఖ్యంగా చెరువుల వద్ద అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా పేరుతో.. పెద్దలకు మినహాయింపు, పేదల ఇళ్లను మాత్రం కూల్చేయడమనే ద్వంద్వ ధోరణిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యల ప్రకారం, సీఎం రేవంత్ స్వయంగా కొడంగల్లో రెడ్డికుంటను పూడ్చి అక్కడ మహల్ నిర్మించారని ఆరోపించారు. రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్ పరిమితిలో ఇంటిని కట్టుకుని జీవిస్తున్నారని పేర్కొన్నారు.

## చార్మినార్ జోన్‌లోనూ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్..!

### జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్‌ఏను కలిసిన నాయకులు

### అతి త్వరలోనే ప్రారంభం కానున్న పదోన్నతుల ప్రక్రియ



2 లో

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్



## మ్యాట్రిమోని గ్రూప్‌లో పాకిస్థాన్ హీరోయిన్ ఫొటో.. యువకుడిని మోసం చేసిన నేరగాళ్లు

మొదటి పేజీ తరువాయి

కొన్నాళ్ల కిందట సామాజిక మాధ్యమాల్లో మ్యాట్రిమోని గ్రూప్‌లో బాధితుడిని యాడ్ చేశారు. ఫాతిమా పేరుతో పెళ్లి కుమార్తెగా, హనీసా పేరుతో ఆమె సోదరిగా పరిచయం చేసుకున్నారు. 2023 నుంచి బాధితుడితో సంప్రదింపులు జరుపుతున్నారు.

పాకిస్థాన్ హీరోయిన్ ఫొటోలను వాట్సప్ డీపీగా పెట్టి బాధితుడితో చాటింగ్ చేశారు. నకిలీ డాక్యుమెంట్లు పంపి తల్లి అనారోగ్యం, ఆర్థిక సమస్యలు ఉన్నాయని నమ్మించారు. దీంతో బాధితుడు కొంత మొత్తాన్ని ఇవ్వగా.. దాన్ని తిరిగి ఇచ్చేశారు. ఆ తర్వాత చికిత్స చేయించాలి, ఇంటి లోన్ కట్టాలంటూ రూ. 21.73లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత అతడిని బ్లాక్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మాటలు కోటలు దాటితే సరిపోదు.. చేతలు కూడా ఉండాలి :సీఎం రేవంత్‌పై హరీష్ రావు సెటైర్

మొదటి పేజీ తరువాయి

'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కార్యక్రమం ఆధారంగా చేసుకొని రాష్ట్రంలో పంట బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తాం అని ఇప్పటి వరకు ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్ ప్రసంగాల్లోనూ (ఓటాన్ అకౌంట్ తో సహా) చెప్పారు. గత బడ్జెట్‌లో రూ.1300 కోట్లు కేటాయించి, కేవలం కాగితాలకే పరిమితం చేసారు తప్ప రూపాయి విదిల్చింది లేదు. అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పంటల బీమాకు అతీగతీ లేక పోవడం కాంగ్రెస్ మార్కు రైతు వ్యతిరేక విధానానికి నిదర్శనం. నిజంగా పంట బీమా అమలు చేయాలనే చిత్తశుద్ధి గనక ఉంటే, మే, జూన్ నెలల్లోనే టెండర్లు పిలవాల్సి ఉంది. కానీ ఆ ప్రక్రియ ఇప్పటికీ చేపట్టక కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. అకాల వర్షాలు, వడగండ్లు, ఇతర విపత్తులు వచ్చిన ప్రతిసారి సాయం అందక రైతన్నలు మరింత చితికిపోతున్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, ఎన్నికల మేనిఫెస్టోలో, బడ్జెట్ ప్రసంగాల్లో పంట బీమా అమలు చేస్తామని చెప్పిన మాటను నిలుపుకోవాలని, యూరియా కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అని హరీష్ రావు ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ అలసత్వంతోనే పాశమైలారం ఘటన : ఎమ్మెల్సీ కవిత

**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వ అలసత్వం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. పరిశ్రమల్లో సేఫ్టీపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బాధితులకు గ్రీన్ ఛానల్ ద్వారా సాయం అందించాలన్నారు.

## కొత్త రేషన్ కార్డుల ముహూర్తం ఫిక్స్



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రేషన్ కార్డు దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ నెల 14న సీఎం రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మొత్తం 2 లక్షలకు పైగా లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఇప్పటికే అర్హత పొందిన దరఖాస్తుదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. రాష్ట్రంలో చాలా ఏళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రేషన్ కార్డుల జారీ కోసం కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కొత్త రేషన్ కార్డుల జారీలో అవలంబించాల్సిన విధానం, అర్హతల గురించి సబ్ కమిటీ ఇచ్చిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు కొత్త కార్డులు, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను జత చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయి. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు మీ సేవా కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వడపోత చేపట్టిన అధికారులు అర్హులైన వారి జాబితాను సిద్ధం చేశారు. దీంతో ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నది ప్రభుత్వం.

త్వరలో స్మార్ట్ కార్డు నమూనా!:

ఈసారి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే విషయాన్ని గతంలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సమావేశంలోనే స్వయంగా వెల్లడించారు. కొత్త రేషన్ కార్డులు సరికొత్తగా బార్ కోడ్‌తో.. ఈజీ యాక్సెస్ చేసేలా రూపొందిస్తామని సీఎం వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొత్త కార్డు స్వరూపంపై తుది నిర్ణయానికి రాగా త్వరలోనే స్మార్ట్ కార్డు నమూనాను ప్రభుత్వం విడుదల చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఏటీఎం కార్డు సైజులో ఒక వైపు సీఎం, మరొక వైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటో.. మధ్యలో ప్రభుత్వం లోగో ఉండేలా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది.

## బనకచర్లకు బ్రేక్ పడలే.. జస్ట్ కామా మాత్రమే..



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ నీటి కేటాయింపు గురించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి కిషన్ రెడ్డి ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీశారు. కేసీఆర్ కోసమే కిషన్ రెడ్డి పని చేస్తున్నారని, ఆయన మాట్లాడే ప్రతిమాట కేసీఆర్ దగ్గరి నుంచే వస్తుందని ఆరోపించారు. నీటి పంపకాల గురించి చర్చించేందుకు మేం వస్తున్నామంటే ఆయన ముందే వెళ్లి కేంద్ర మంత్రిని కలుస్తున్నారు.. కిషన్ రెడ్డి తీరు అనుమానాలకు తావు ఇస్తోందన్నారు.

కేంద్రమంత్రులను కలిసేందుకు కిషన్ రెడ్డి మాతో కలిసి ఎందుకు రావడం లేదు.. మాకంటే ముందే వెళ్లి రహస్యంగా వెళ్లి చర్చించాల్సిన అవసరమేంటి అని ప్రశ్నించారు. గోదావరి వరద జలాలను తరలిస్తే తెలంగాణకు ఇబ్బందేంటని ఏపీ వాదిస్తోంది. మరీ నికర జలాల్లో మా వాటాపై ఏపీ ఎందుకు అభ్యంతరం చెప్తోందని నిలదీశారు. మూడో పంట కోసం ఏపీ ప్రయత్నిస్తోందని.. ఇక్కడ మాకు మొదటి పంటకే నీళ్లు లేవని అన్నారు. మా నీటి వాటాలపై ఏపీ కూడా సహకరించాలని కోరారు. కేసీఆర్ హయాంలో జరిగిన చర్చల మేరకే చంద్రబాబు ప్రాజెక్ట్ కడుతున్నారన్నారు. నికర జలాల్లో 968 టీఎంసీలు, ప్రాజెక్టులకు అనుమతుల కోసమే మా ప్రయత్నమని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య నికర జలాలు, మిగులు, వరద జలాల లెక్కలు తేల్చాలని కేంద్రాన్ని కోరతున్నాం.. అన్ని లెక్కలు తేలాకే వరద జలాల గురించి మాట్లాడాలని ఖరాకండిగా చెప్పారు.రొయ్యల పులుసు, రాగి సంకటితో మాకు పని లేదని.. నీళ్ల ప్రయోజనాలే మాకు ముఖ్యమని తేల్చి చెప్పారు

## చార్మినార్ జోన్‌లోనూ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్..!

### జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్ఏను కలిసిన నాయకులు

### అతి త్వరలోనే ప్రారంభం కానున్న పదోన్నతుల ప్రక్రియ



**హైదరాబాద్ బ్యూరో, 01 జులై (కెరటం న్యూస్):** చార్మినార్ జోన్‌లోనూ సీనియర్ అసిస్టెంట్ నుండి నాయబ్ తహసీల్దార్ వరకు పదోన్నతుల ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని రెవెన్యూ జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి తెలిపారు. కోర్టు కేసు కారణంగా కేవలం చార్మినార్ జోన్‌లోనే పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జోన్లల్లో సీనియర్ అసిస్టెంట్ నుండి డిప్యూటీ తహశీల్దార్ వరకు పదోన్నతులను రెవెన్యూ జేఏసీగా ఇప్పటికే ఇప్పించడం జరిగిందన్నారు.మంగళవారం రెవెన్యూ జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్ఏ లోకేష్‌కుమార్‌ను డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, తదితరులు కలిసి పదోన్నతుల గురించి వివరించారు. అర్హులకు వెంటనే పదోన్నతులను ఇవ్వాలని కోరారు. చార్మినార్ జోన్‌లో కోర్టు కేసు కారణంగానే పదోన్నతుల ప్రక్రియ నిలిచిందన్నారు. కోర్టు కేసు పరిష్కారం కావడంతో ఆగిపోయిన సీనియర్ అసిస్టెంట్ నుండి నాయబ్ తహసీల్దార్ పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను చేపట్టి, వేగవంతం చేయాలని కోరారు. దీనిపై సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. అతి త్వరలోనే పదోన్నతుల ప్రక్రియను చేపట్టి అర్హులందికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## బనకచర్లకు అనుమతుల తిరస్కరణ తెలంగాణ సర్కార్ విజయం: మంత్రి ఉత్తమ్

**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వ విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదస్పదంగా మారిన బనకచర్ల ప్రాజెక్ట్‌పై మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత అధికారులు ఈ పీపీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని.. అందుకే బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు తిరస్కరించిందన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయమని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వాదనలు పూర్తిగా అవాస్తమని అన్నారు.

కాగా, ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్‌కు తేల్చిచెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిప్పిపంపింది.

బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది.

## బడాబాబుల ఇళ్లు కనబడవా? హైడ్రా చర్యలపై కేటీఆర్ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి


రెవెన్యూ మంత్రి హిమాయత్ సాగర్ వద్ద ప్యాలసుల్లా ఇళ్లు నిర్మించారని, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చెరువు మధ్యలో గెస్ట్ హౌస్ నిర్మించారని ఆరోపించారు. కేవీపీ రామచంద్రరావు వంటి పెద్దలు కూడా బఫర్ జోన్‌లో గెస్ట్ హౌస్‌లు కట్టుకున్నారని అన్నారు. అంతేగాక, కొందరు ప్రముఖ బిల్డర్లు ప్రభుత్వానికి లంచాలు ఇచ్చి మూసి నదిలోనే అపార్ట్‌మెంట్లు నిర్మించుకుంటున్నారని ఆరోపించారు.

ఇవన్నీ ప్రభుత్వానికి కనబడవని ఎద్దేవా చేసిన కేటీఆర్, హైడ్రా (హైదరాబాద్ రెగ్యులేటరీ అథారిటీ) కు మాత్రం సామాన్యుల ఇళ్లు మాత్రమే కనిపిస్తున్నాయంటూ విమర్శించారు.

తమ ఇళ్లు కూల్చొద్దని నిరుపేదలు చేతులు జోడించినా, హైకోర్టు స్టే ఆర్డర్ చూపించినా ప్రభుత్వం కనికరం చూపడం లేదని మండిపడ్డారు. ఇదంతా ఒక వ్యవస్థను తలకిందులుగా నడిపే ధోరణికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన: మంత్రి పొంగులేటి

**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** తెలంగాణలో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.



మంగళవారం రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటిని భూభారతి పోర్టల్‌లో నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్‌గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో వివరాలను రాతపూర్వకంగా దరఖాస్తుదారులకు పంపాలన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించి తద్వారా వచ్చిన 8,27,230 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తుల డేటాను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఏప్రిల్ 17 నుంచి జూన్ 20 వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు వివరించారు. సర్వే నంబర్లలో లోపాలు పీపీబీ, ఆర్వోఆర్, నాలా, ఆర్ఎస్ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టు కేసులు, పోడు భూములు తదితర 30 రకాల భూ సమస్యలకు చెందిన 8.27 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తాం..

**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రిగా ఉన్న ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తిరిగి వస్తే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ను నిషేధిస్తామని అన్నారు. ఆర్ఎస్ఎస్ సమాజంలో ద్వేషాన్ని వ్యాప్తింపచేస్తోందని ఆరోపించారు. చట్టపరిధిలో ఆ సంస్థ పనిచేయడం లేదని అన్నారు.

ప్రియాంక్ ఖర్గే తన వాదనల్ని సమర్థించుకోవడానికి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. గతంలో సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్ ని నిషేధించారని, ఆయన పాదాలపై పడి దేశ చట్టాలను పాటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇందిరా గాంధీ కూడా ఆర్ఎస్ఎస్‌ని నిషేధించారని, వారు చట్టాన్ని పాటిస్తున్నట్లు నటిస్తున్నారని, వారికి రూ. 250 కోట్ల నిధులు ఎలా వచ్చాయి, వీటిపై దర్యాప్తు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. అంతకుముందు కూడా ఖర్గే ఆర్ఎస్ఎస్ గురించి ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను రెండింటిని వ్యతిరేకిస్తుందని, బీజేపీ దాని కీలుబొమ్మగా పనిచేస్తుందని విమర్శించారు.

## మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం

మొదటి పేజీ తరువాయి

మంగళవారం మంత్రులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్.. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో ఇన్ని ప్రాణాలను బలిగొన్న ప్రమాదం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫైర్, హైడ్రా, డిజాస్టర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకోవాలో ఆదేశించడం జరిగిందని చెప్పారు.

ఈ ఘటనలో అధికారిక సమాచారం ప్రకారం 36 మంది చనిపోయారని సీఎం రేవంత్ తెలిపారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది ఉన్నారని, 58 మంది వివరాలు అధికారుల దృష్టిలోకి వచ్చాయని, మిగతా వారు శిథిలాల కింద ఉన్నారా లేక భయంతో టచ్ లోకి రాలేదా అనేది స్పష్టంగా తెలియదని అన్నారు.

సిగాచి ఫ్యాక్టరీ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు సీఎం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యం, బాధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికలన సిద్ధం చేస్తామని చెప్పారు. ఘటనలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని.. ప్రాథమిక సమాచారం తర్వాత ప్రమాదపై పూర్తి వివరాలు చెబుతామని అన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలను భవిష్యత్ లో జరగకుండా ఉండేందుకు.. ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు సీఎం రేవంత్.

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

బీవీ పట్టాభిరామ్.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ సంతానంలోని పదిహేను మందిలో ఒకరు. కౌమారదశలో కాలి వైకల్యంతో కలిగిన ఆత్మన్యూనతా భావాన్ని జయించి తనని తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతున్న రోజుల్లో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి నుంచి ఆ విద్యను నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఆహార సంస్థలో ఉద్యోగం చేసే రోజుల్లోనూ సాధన చేసేవారు. 1970 దశకం నాటికి స్వతంత్రంగా రెండుమూడు గంటలపాటు ప్రేక్షకులను కదలనీయకుండా ఇంద్రజాలం ప్రదర్శించే స్థాయికి పట్టాభిరామ్ ఎదిగారు.

ప్రజలను జాగృతం చేస్తూ..

1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలకు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారు. గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'రెండురెళ్లు ఆరు'లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు శోభన్ బాబు, అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ, జయప్రద, రాజేంద్రప్రసాద్ తదితరులు ఆయనకు అభిమానులుగా మారిపోయారు. పలు పత్రికల్లో బీవీ పట్టాభిరామ్ వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు.

## భూదాన్ భూముల్లో ప్రహరీగోడ నిర్మాణం.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు



**న్యూస్ డెస్క్, 01 జులై (కెరటం న్యూస్):** ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల భూముల వ్యవహారంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హైకోర్టు స్టే విధించినా ప్రహరీగోడ నిర్మిస్తున్నారంటూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. రంగారెడ్డి కలెక్టర్‌తోపాటు ప్రతివాదులుగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.

మహేశ్వరం మండలం నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూదాన్ భూములను ఆక్రమించారంటూ పిటిషన్ దాఖలు కాగా.. ఆయా భూములకు సంబంధించి లావాదేవీలు జరపొద్దని, వాటిని నిషేధిత జాబితాలో చేర్చాలని హైకోర్టు ఆదేశించింది. కోర్టును ఆదేశించినా ప్లాట్ల చుట్టూ ప్రహరీగోడ నిర్మిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు ఫొటోలను అందించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది.

## ఎంపీ వద్దిరాజుకు అభినందనలు, సత్కారం



హైదరాబాద్ బ్యూరో, 01 జులై (కెరటం న్యూస్): గోదావరి జలాలను అక్రమంగా తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను వమ్ము చేయడంలో తన వంతు పాత్ర పోషించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమ రావు పటేల్, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొమ్మెర రాంమూర్తి తదితర ప్రముఖులు అభినందించారు.ప్రతిపాదిత "పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్"పై తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనను ఎంపీ రవిచంద్ర తీవ్రంగా వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పక్షాన బలమైన వాదన వినిపించిన విషయం తెలిసిందే.ఈ ప్రాజెక్ట్ కు అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర అటవీ,పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎక్స్ పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) సోమవారం తేల్చిచెప్పడం పట్ల పురుషోత్తమ రావు, రాంమూర్తిలు హర్షం వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా వారు మున్నూరుకాపు ప్రముఖులు ఉప్పు సత్యనారాయణ పటేల్,అరుణా పటేల్, సురేందర్ పటేల్ తదితరులతో పాటు ఎంపీ వద్దిరాజును మంగళవారం ఉదయం కలిసి మొక్క అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## మున్నూరుకాపు నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి

### అపెక్స్ కౌన్సిల్ డిమాండ్



హైదరాబాద్ బ్యూరో, 01 జులై (కెరటం న్యూస్): మున్నూరుకాపు నాయకుడిని వెంటనే మంత్రివర్గంలోకి తీసుకోవాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్స్ అమలు పర్చాలని మున్నూరుకాపుల అత్యున్నత నిర్ణాయక మండలి అయిన అపెక్స్ కౌన్సిల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేసింది.సంఘం గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, నూతన అధ్యక్షుడు పుటం పురుషోత్తం రావు పటేల్ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు వీ.ప్రకాష్, సీ.విఠల్, రౌతు కనకయ్య, బొంతు రాంమోహన్,మీసాల చంద్రయ్య, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితర ప్రముఖులు హాజరై పలు అంశాలపై సమాలోచనలు జరిపారు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మున్నూరుకాపు నాయకుడు లేకపోవడం విచారకరమని, గతంలో ఏనాడు కూడా ఇటువంటి పరిస్థితి దాపురించలేదని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది.తమ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని వెంటనే మంత్రిమండలిలోకి తీసుకుని ప్రాధాన్యత కలిగిన శాఖను కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో 42శాతం రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందిగా కాంగ్రెస్ అధిష్టానాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మున్నూరుకాపు ప్రముఖులు డిమాండ్ చేశారు. తమ



సామాజిక వర్గానికి చెందిన అధికారులకు ఏ మాత్రం ప్రాధాన్యత లేని శాఖలిచ్చి ప్రభుత్వ పాలనకు దూరం పెట్టడమే కాక ఏసీబీ దాడులతో భయభ్రాంతులకు గురి చేయడాన్ని సమావేశం తప్పుబట్టింది. రాష్ట్ర జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరుకాపులను మరింత ఐక్యం చేస్తూ,చైతన్యపరుస్తూ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయాలని సమావేశంలో మాట్లాడిన వక్తలు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించాలని, హైదరాబాద్ నగరంలో భారీ బహిరంగ సభను జరపాలని, ఇతర బీసీ కులాల వారితో స్నేహం పెంచుకుంటూ రాజ్యాధికారం వైపు ముందుకు సాగాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, కోశాధికారి కంచె సత్యనారాయణ, కార్యనిర్వహక అధ్యక్షులు బుక్కా వేణుగోపాల్, డాక్టర్ జే.ఏన్. వెంకట్, చల్లా హరిశంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మక్క, నాయకులు ఉప్పు రవీందర్,వాసాల వెంకటేశ్వర్లను శాలువాలతో సత్కరించారు. సంఘం ఎన్నికలను పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల ప్రధానాధికారి జే.డీ. లక్ష్మీనారాయణ, అధికారులు మంగబాబు, ఎర్రా నాగేంద్రబాబు, న్యాయ సలహాదార్లు లవంగాల అనిల్, ఊసా రఘులను సమావేశానికి హాజరైన వారంతా అభినందించారు

## 42 శాతం బి.సి. రిజర్వేషన్ తో స్థానిక ఎన్నికలు నిర్వహించాలి...ఆర్.జే.సి కృష్ణ



ఖమ్మం టౌన్, 01 జులై (కెరటం న్యూస్): ఖమ్మంలో జరిగిన బి.సి. ఎక్జుక్యూటివ్ సమావేశంలో ఆర్.జే.సి. కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం 42 శాతం బి.సి. రిజర్వేషన్ తో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని హామీ ఇచ్చి, హైకోర్టు ఆదేశాల పేరుతో ఎన్నికలు నిర్వహించాలని అనుకోవటం సరియైనది కాదని, సత్వరమే అఖిలపక్ష బేటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం మరియు బి.జే.పి. పార్టీల పై వత్తిడి తేవాలని అభిప్రాయపడ్డారు.కూరాకుల నాగభుషణం మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ తో ఎన్నికలు జరగనట్లయితే కాంగ్రేస్ తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని తెలియజేశారు. బొమ్మా రాజేశ్వరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ పేరుతో గతంలో 23 శాతం ఇవ్వగా ఇప్పుడు అది కూడా నష్టపోయే పరిస్థితి వచ్చిందని, కాబట్టి బి.సి.లు అందరు ఒకే తాటి పైకి వచ్చి 42 శాతం రిజర్వేషన్ పట్టుపట్టి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంఘం నేతలు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం తోనే లంబాడీల సమస్యలు సమస్తం పరిష్కారం



ఖమ్మం టౌన్, 01 జులై (కెరటం న్యూస్): రాజ్యాధికారంతోనే లంబాడీల సమస్యలు సమస్తము పరిష్కారం చెందుతాయ ని , ఆ దిశగా లంబాడీలు ముందుకు సంఘటితంగా కదలాలని లంబాడి హక్కుల పోరాట సమితి నంగారా బేరి ( ఎల్ హెచ్ పి ఎస్ ) రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ , వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి లు పిలుపునిచ్చారు. ఎల్ హెచ్ పి ఎస్ ఆవిర్భవించి , 28 వసంతాలు పూర్తి చేసుకొని, 29వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా జరిగిన సంఘం ఆవిర్భావ సభలో ప్రసంగించారు. భావ సారూప్య పార్టీలు , సంఘాలతో ఐక్య కార్యాచరణకు సిద్ధం కావాలన్నారు. తొలుత రోడ్లు భవనాల అతిథిగృహం సమీపంలో గల పూలే చౌక్ లో పూలే దంపతుల విగ్రహాల తో పాటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , సేవాలాల్ మహారాజ్ , టా ను నాయక్ , మారోజు వీరన్న చిత్రపటాలకు ఎల్ హెచ్ పి ఎస్ గౌరవ సలహాదారుడు భూక్య రాంబాబు నాయక్ , వీర నారీమణుల శయ సాధన సమితి అడ్వైజర్ బానోతు తారా దేవి లు సంఘం జెండాను ఆవిష్కరించగా భద్రాద్రి కొత్తగూడెం ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు కేశవ నాయక్ ,ఖమ్మం ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మోహన్ నాయక్ కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి పాత బస్టాండ్ మీదుగా తిరిగి గెస్ట్ హౌస్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గూగు లోతు రవీందర్ నాయక్ అధ్యక్షుడు జరిగిన సభలో వారు మాట్లాడా రు. బహుజన ఉద్యమ నిర్మాత మారోజు వీరన్న సూచనల మేరకు 1997 జూలై 1న ఆవిర్భవించిన లంబాడి హక్కుల పోరాట సమితి బి నంగారా బేరి తన 28 ఏళ్ల ప్రస్థానంలో తండాలను గ్రామ పంచాయితీలుగా డిమాండ్ ను సాధించుకుందని తెలిపారు. ఇదే విధమైన స్ఫూర్తితో మరి కొన్ని హక్కుల సాధనకు మాత్రమే పరిమితం కాకుండా సమస్త డిమాండ్ల పరిష్కారం కోసం ఎస్సీ బీసీ ముస్లిం మైనార్టీలతో కలసి , రాజ్యాధికార దిశగా ప్రణాళికబద్ధంగా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ సీఐ పుల్లూరు నాగయ్య , లీగల్ సేల్ ధరావత్ వీరన్న , బహుజన జేఏసీ నాయకులు నాగేశ్వరరావు , సంజీవరావు , రవి , కార్మిక నాయకులు సంజీవరావు , అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అఖిల్ లు మాట్లాడుతూ ఉద్యమాలు పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని , లంబాడీలు భవిష్యత్తు ఉద్యమాలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని లేనిపక్షంలో అణగారిన వర్గాల అస్తిత్వాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీర నారీమణుల ఆశయ సాధన సమితి నాయకులు భూక్య జ్యోతి బాయి , బానోతు త్రివేణి ,సరోజని, ప్రమీల, లతా ,ఝాన్సీ ,రేణుక ,లలిత ,స్పందన, కవిత ,శ్రీదేవి, సుభద్ర ,నాగేంద్ర నాయక్ , దుర్గ భవాని, లక్ష్మి, విజయ , ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు నాగేంద్ర నాయక్ ,కృష్ణా నాయక్ ,మురళి నాయక్ ,రాము నాయక్, రవి నాయక్, కిషన్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## వైరా రిజర్వాయర్ ఆయకట్టు సాగునీరు విడుదల షెడ్యూల్ ప్రకటించాలి-తెలంగాణ రైతు సంఘం



వైరా, 01 జులై (కెరటం న్యూస్): వైరా రిజర్వాయర్ ఆయకట్టు సాగునీరు విడుదల షెడ్యూల్ ప్రకటించాలి అని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ నాగార్జున సాగర్ కృష్ణా నది వైరా రిజర్వాయర్ పరివాహక ప్రాంతాల్లో ఆశాజనకం గా వర్షాలు కురుస్తున్నాయి అని శ్రీశైలం ఐదు రోజుల్లో నిండె అవకాశం ఉందని జలమండలి ప్రకటించిన నేపథ్యంలో మరోవైపు వైరా రిజర్వాయర్ లో 16 అడుగుల నీటిమట్టం ఉందని తక్షణమే వరి నారుమళ్లు కు నీరు విడుదల చేయాలని కోరారు, గత సంవత్సరం వరి నాట్లు ఆలస్యం కావడంతో దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆదాయం కోల్పోయారు అని ఈ సీజన్లో వర్షాలు, వరదలు సాగు నీటి ప్రాజెక్టుల ఏరియాలో అనుకూలంగా ఉండడం వల్ల రైతులకు ఉపయోగకరంగా సాగునీరు అందించేందుకు సత్వరమే నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరారు, వైరా రిజర్వాయర్ పంట కాలువలు మరమ్మతులు అవసరమైన చోట చేపట్టాలని కోరారు, ఇరిగేషన్ డిఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూలై రెండవ వారం నుంచి సాగునీరు విడుదల చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, పెద్ద బీరవల్లి సోసైటి ఛైర్మన్ చింతలచెర్వు కోటేశ్వరరావు,వైరా మండల అధ్యక్షులు మేడా శరబంధి, పట్టణ కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, కిలారు సురేష్,గాలి అరుణ, చింత నిప్పు చంద్రరావు,పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, హరి వెంకటేశ్వరరావు, పల్లె బోయిన కృష్ణ,బెజవాడ వీరభద్రం, పైడిపల్లి సాంబశివరావు, సంక్రాంతి పురుషోత్తం, వెంపటి రాజా, కామినేని రవి, వాసిరెడ్డి విద్యాసాగర్, మల్లెంపాటి ప్రసాద్,వడ్లమూడి మధు,బాలెపోగు శ్రీను ,చిత్తారు మురళి, పుచ్చకాయల రామయ్య, కొంగర సుధాకర్, మాడపాటి రాజేష్,గోడ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో చిన్నారులు వైద్యులైన వేళ




ఖమ్మం టౌన్, 01 జులై (కెరటం న్యూస్): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు వైద్యుల వేషధారణలో పలు రకాల వైద్య సేవలు అందిస్తూ అందరిని ఆకట్టుకున్నారు. వైద్యశాలలో డాక్టర్లు నిర్వహించే వివిధ రకాల వైద్య పరీక్షల నమునాలను చిన్నారులు ప్రదర్శించారు. థర్మా మీటర్ తో జ్వరం పరీక్షించడం, ముక్కు, చెవులను, నాడీని పరీక్షించి వైద్య సలహాలు ఇవ్వడం , ఆపరేషన్ థియేటర్లో వైద్యులు నిర్వహించే నమూనా పరీక్షలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ వైద్యులు ఆరోగ్యాన్ని ప్రసాదించి ప్రాణాలను రక్షిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో తాము ఇబ్బందులు పడుతూనే వేలాదిమంది రోగులను రక్షించి ప్రాణదాతలయ్యారని తెలిపారు. మనదేశ ప్రాచీన చరిత్రలో ప్రముఖ ఆయుర్వేద నిపుణులు ధన్వంతరి మొదలుకొని ప్రస్తుతం అత్యాధునిక వైద్యుల వరకు మన దేశ వైద్య కీర్తిని చాటి చెప్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మేయర్ స్థానమే లక్ష్యం గా మున్నూరు కాపులు ఎన్నికలను ఎదుర్కోవాలి: ఆర్జేసి కృష్ణ



ఖమ్మం టౌన్, 01 జులై (కెరటం న్యూస్): రానున్న ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ స్థానమే లక్ష్యం గా మున్నూరు కాపులు మిగతా బీసీ కులాల ను కలుపుకొని ముందుకు సాగాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పిలుపు నిచ్చారు. సంఘం 33వ డివిజన్ ఆత్మీయ సమావేశం స్థానికం గా జరిగింది. ఈ కార్యక్రమం లో కృష్ణ అతిధి గా పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులు మిగతా బీసీ కులాల ను కలుపుకొని ఐక్యం గా ముందుకు సాగాలన్నారు. రాజకీయ పార్టీ లు మున్నూరు కాపులతో పాటు బీసీ కులాల వారికి జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం డివిజన్ నూతన కమిటీ నీ ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు గా మార్తా నరసింహ రావు,అల్లం వీరభద్ర%శీ% ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో సంఘం నాయకులు గీత వెంకన్న, కొత్తా సీతారాములు, తాళ్లూరి హనుమంతరావు, తోట వీరభద్రం, కస్తూరి లక్ష్మీ నారాయణ, జంగిలి రమణ, గుండెపునేని కమలాకర్,అల్లం శ్రీను,యర్రా అప్పారావు,మాటేటి రవి తదితరులు పాల్గొన్నారు..

కెరటం న్యూస్
బుధవారం 02 జులై 2025

# టీమిండియాకు గుడ్‌న్యూస్.. రెండోటెస్ట్‌లో బుమ్రా ఆడుతాడని చెప్పిన అసిస్టెంట్ కోచ్..!

స్పోర్ట్స్ న్యూస్, 01 జూలై (కెరటం న్యూస్):ఇంగ్లాండ్‌తో బర్మింగ్‌హామ్‌లో జరిగే రెండో టెస్టుకు ముందు భారత జట్టుకు భారీ ఉపశమనం లభించింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కు



అందుబాటులో ఉంటాడని జట్టు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ ధ్రువీకరించారు. అయితే, అతనిపై టీమ్ మేనేజ్‌మెంట్ తుది నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. ఇంగ్లాండ్-భారత్ రెండో టెస్టు జులై 2 నుంచి మొదలుకానున్నది.

ఇంగ్లాండ్ పర్యటనలో బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ ధ్రువీకరించాడు. ఐదు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడంపై చర్చనీయాంశంగా మారింది. కానీ, బుమ్రా రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడని మ్యాచ్‌కు ముందు డోస్చేట్ బుమ్రా ఆడుతాడని ధ్రువీకరించడం భారత్‌కు ఊరటనిచ్చే అంశం. వాస్తవానికి రెండోటెస్టుకు బుమ్రా అందుబాటులో ఉండడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ తొలి టెస్టును ఐదు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ తొలి టెస్టులో రాణించకపోవడంతో బర్మింగ్‌హామ్ టెస్టుకు బుమ్రా ఆడడం కీలకంగా మారింది. రెండోటెస్టుకు ముందు డోస్చేట్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. బుమ్రా ఎడ్జ్ బాస్టన్ టెస్టు ఆడుతాడని ధ్రువీకరించాడు. ఈ మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని తెలిపారు. ఐదు టెస్టుల్లో మూడు టెస్టులు ఆడతాడని మాత్రమే మొదటి నుంచి తెలుసునని.. చివరి టెస్ట్ నుంచి బుమ్రాకు ఎనిమిది రోజుల విశ్రాంతి దొరికిందని చెప్పారు. అయితే, పనిభారం చూస్తే మిగతా మ్యాచుల్లో బుమ్రా ఎలా ఆడగలడో చూడాలని.. ఈ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని డోస్చేట్ పేర్కొన్నారు.

వాస్తవానికి, టీమిండియా బౌలింగ్ భారం మొత్తం బుమ్రాపైనే పడుతున్నది. తొలి టెస్టులో బుమ్రా ఏకంగా 43.4 ఓవర్లు వేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 24.4, రెండో ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లు బౌలింగ్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లు ఏమీ తీయలేకపోయాడు. అయితే, బుమ్రాకు మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించడం లేదు. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో బౌలింగ్ భారం బుమ్రాపైనే పడుతున్నది. బుమ్రా మూడు మ్యాచులు ఆడితే.. మిగతా రెండు టెస్టుల్లో అతని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# సచిన్ సూపర్ పవర్ నాకు కావాలి

స్పోర్ట్స్ న్యూస్, 01 జూలై (కెరటం న్యూస్): సచిన్ తెందుల్కర్ సూపర్ పవర్ తనకు కావాలని కోరుకుంటున్నానని స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా అన్నాడు. ఎంతో మంది గొప్ప బౌలర్ల సవాళ్లను సచిన్ సమర్థంగా ఎదుర్కొన్నాడని నీరజ్ చెప్పాడు. ఏ క్రికెటర్ సూపర్ పవర్‌ను సొంతం చేసుకోవడానికి ఇష్టపడతారన్న ప్రశ్నకు నీరజ్ స్పందిస్తూ.. "సచిన్



తెందుల్కర్ సూపర్ పవర్ కావాలి. దేశానికి ఎన్నో ఏళ్లు ప్రాతినిధ్యం వహించిన అతడు.. అనేక రికార్డులు నెలకొల్పాడు. మేటి బౌలర్ల నుంచి సవాళ్లను అద్భుతంగా ఎదుర్కొన్నాడు. అసాధారణ ప్రదర్శన చేశాడు. ఆ సూపర్ పవర్ నాకు కావాలి. దాంతో నేనూ సచిన్ లాగే రాణించడానికి ప్రయత్నిస్తా. సవాళ్లను ప్రశాంతంగా ఎదుర్కోవడానికి ఆ పవర్ నాకు ఉపయోగపడుతుంది" అని అన్నాడు. ఏ క్రికెటర్ జావెలిన్ విసరగలడని భావిస్తున్నారన్న ప్రశ్నకు.. బ్రెట్‌లీ అని బదులిచ్చాడు నీరజ్. "బ్రెట్‌లీ జావెలిన్ త్రోయర్ అని విన్నా. అతడు బాగా విసరగలడు. బుమ్రా విసిరితే చూడాలనుంది. అతడు నాకు కొన్ని బౌలింగ్ మెళకువలు నేర్పిస్తాడని కూడా ఆశిస్తున్నా. బౌలింగ్, జావెలిన్.. రెండూ త్రోలే అయినా భిన్నమైనవి. బుమ్రా నుంచి నేర్చుకోవాలనుకుంటున్నా" అని నీరజ్ చెప్పాడు. నీరజ్ ఈ నెల 5న బెంగళూరులో ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్లో పోటీపడతాడు.

# దీపావళికి కిరణ్ ర్యాంప్..




మూవీ న్యూస్, 01 జులై (కెరటం న్యూస్): కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా రూపొందుతున్న కమర్షియల్ ఎంటైర్టైనర్ 'K-ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. జైన్స్ నాని దర్శకుడు. రాజేష్ దండా, శివ బొమ్మకు నిర్మాతలు. దీపావళి కానుకగా ఈ సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. లుంగీ కట్టుకొని చిందేస్తున్న కిరణ్ అబ్బవరంని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్యాక్ గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌లో డిజైన్ చేసిన లవ్‌సింబల్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో ఫ్రెష్ అటెంప్ట్ ఈ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్‌రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్.

# ప్రతి 8 గంటలకోసారి స్టెరాయిడ్ తీసుకోవాల్సిందే

మూవీ న్యూస్, 01 జులై (కెరటం న్యూస్): మిస్ యూనివర్స్ అనేది ఒకటి అంటుందని, ఈ పోటీలలో పాల్గొంటే క్రేజ్ ఎలా ఉంటుందో మొట్టమొదట భారతదేశానికి పరిచయం చేశారు సుస్మితా సేన్. 1994లో కేవలం 18 ఏళ్ల వయసులోనే, మనీలాలో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలలో విజయం సాధించి, ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా సుస్మితా సేన్ నిలిచిపోయింది. అందం, అభినయం, ప్రతిభ, ఆత్మ



విశ్వాసం ఆధారంగా ఆమెకు ఈ ఘనత దక్కింది. కానీ ఆమె జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొందట. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో సుస్మిత చేసిన వ్యాఖ్యలు ప్రేక్షకుల హృదయాలను తాకాయి. కెరీర్ పరంగా ఎంతో బలంగా కనిపించిన ఈ నటి, 2014లో అరుదైన ఆటో ఇమ్యూన్ వ్యాధి అయిన అడిసన్ డిసీజ్ బారినపడినట్టు తాజాగా వెల్లడించింది. సుస్మితాకు అడ్రినల్ గ్రంథులు కార్టిసాల్ హార్మోన్‌ను ఉత్పత్తి చేయడం ఆగిపోయింది. ఫలితంగా ఆమెకు ప్రతి 8 గంటలకు హైడ్రోకార్టిసోన్ అనే స్టెరాయిడ్ తీసుకోవడం తప్పనిసరైంది. ఒకవేళ మిస్ అయితే, అది ప్రాణాంతకం అవుతుంది ఆమె చెప్పడం నిజంగా బాధాకరమైన విషయం. అయితే ఈ పరిస్థితిని ఆమె ఓ బలంగా మార్చుకున్నారు. కేవలం మందుల పైనే ఆధారపడకుండా, వ్యతిరేక దిశలో పయనమవుతూ యోగా, జిమ్నాస్టిక్స్, డైలీ వ్యాయామం ద్వారా శరీరాన్ని మళ్లీ బలంగా మార్చుకున్నారు. ఆమె శ్రమను చూసిన వైద్యులు సైతం ఆశ్చర్యపోయారు. 'ఇది ఒక యుద్ధం.. కానీ నేను నా శరీరానికి ఓ ప్రేమ తో పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను. అదే నాకు మళ్ళీ జీవితం ఇచ్చింది' అని తెలిపింది.

# క్లాప్ కొట్టేశారు



మూవీ న్యూస్, 01 జులై (కెరటం న్యూస్): విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. పూరి కనెక్ట్స్, జెబి మోషన్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సంయుక్త కథానాయిక. టబు , విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. ఈ వారంలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్నమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనుంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.